క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



పూజలో పాల్గొన్న భక్తులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్థానిక సాయిబాబా ఆలయం ఆవరణలో గురుస్వామి తిరుపతి, దేవమంగలు దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించిన అంబలం పూజ ఘనంగా జరిగింది. గురుస్వామి కామేశ్వరరావు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అయ్యప్పమాలధారులు తరలివచ్చారు. అయ్యప్పస్వామి నామ స్మరణతో ఆలయ ఆవరణం మార్మోగింది. స్వామి వారి ప్రసాద వితరణ జరిగింది. అధిక సంఖ్యల్లో భక్తులు పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ



గుల్లేలులో రగ్గులను పంపిణీ చేస్తున్న సెయింట్ ఆన్స్ స్కూల్ సిబ్బంది

పెదబయలు: మండలంలోని గుల్లేలు పంచాయతీ కేంద్రంలో సెయింట్ ఆన్స్ స్కూల్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు రగ్గులు, శాలువాలు, మంకీ క్యాప్‌లను గురువారం పంపిణీ చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ నిర్మల మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని చెప్పారు. పాఠశాల తరఫున పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పేద గిరిజనులను తమ వంతు ఆదుకుంటున్నామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కుషుమ గ్రేస్, మాజీ జెడ్పీటీసీ కె.సూర్యనారాయణ, పాఠశాల సిబ్బంది కేశవరావు, రాజు, పార్వతి, విజయ తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామ్మోహనరావు

పెదబయలు: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎ.వి.ఎస్.కళాశాల రిటైర్డ్ కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ కె.రామ్మోహనరావు అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో క్యాన్సర్ నివారణ మార్గాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పొగ తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పొగాకు, ఖైనీ, సిగరెట్, మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని, రోజూ వ్యాయామం చేయాలని, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రిన్సిపాల్ టి.నాగేశ్వరరావు, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ దుర్గారావు

సీలేరు: చింతపల్లి ఏరియా ఆస్పత్రి ఎడాల్‌సెంట్ కౌన్సిలర్ పి.దుర్గారావు సీలేరు పీహెచ్‌సీని సందర్శించారు. సిబ్బందికి పలు అంశాలపై సూచనలిచ్చారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ మస్తాన్ వలీతో కలిసి విప్స్ కార్యక్రమంలో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా రక్తహీనత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి కె.జోజిబాబు, ప్రిన్సిపాల్ హేమ సుందర్ పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె నోటీసు

అరకులోయ రూరల్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న విధులు బహిష్కరిస్తున్నట్లు టూరిజం కార్మికులు సమ్మె నోటీసును గిరిజన మ్యూజియం సూపర్‌వైజర్ సుమన్‌కు అందజేశారు. వేతనాలు చెల్లించాలని కోరారు.

మండలం: చింతూరు

పంచాయతీలు:	గ్రామాలు:	జనాభా:	ప్రధాన రిజర్వాయర్:	తాగునీటి పథకాలు:	చేతి పంపులు:	సోలార్ పథకాలు:
18	125	40,725	శబరినది	55	900	19

సఫలం.. భగీరథ యత్నం



- సీపీడబ్ల్యూఎస్‌ఎస్‌తో 26 గ్రామాలకు తాగునీరు

చెంతనే నది ఉన్నా.. గుక్కెడు నీటి కోసం తప్పని ఇక్కట్లు.. తాగునీటి కోసం ఆ గ్రామస్తుల ఇబ్బందులు వర్ణనాతీతం. చింతూరు మండలం చెంతనే శబరినది ప్రవహిస్తోంది. మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలకు తాగునీటి సదుపాయం లేక మండలవాసులు నానా అవస్థలు పడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకులు ఈ ప్రాంతంలో తాగునీటి సమస్యను కనీసం పట్టించుకోలేదు. గత్యంతరం లేక గెడ్డలు, పాడుబడిన బావుల్లోని కలుషిత నీటిని వినియోగిస్తూ రోగాల బారిన పడేవారు.. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మండలంలోని తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలతో తాగునీటి పథకాలు, పైపులైన్ ద్వారా నీటి సరఫరా చేసింది. ఏళ్లతరబడి సమస్య పరిష్కారమవడంతో మండలవాసులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

చింతూరు: చెంతనే ఎన్నో జీవనదులున్నా చింతూరు మండల ప్రజలకు ఎల్లప్పుడూ తాగునీటికి ఇబ్బందులే ఉండేవి. మండల కేంద్రానికి తాగునీరు అందించేందుకు తాగునీటి పథకాలున్నా మోటార్లు చెడిపోయి, పైపులు పగిలిపోయి నిత్యం మరమ్మతులకు గురవుతూ రోజుల తరబడి నీటి సరఫరా కాక ప్రజలు బాధలు పడేవారు. తరచూ మరమ్మతులు చేపడుతున్నా తిరిగి షరా మామూలే అన్న చందంగా తాగునీటి సరఫరా దుస్థితి ఉండేది. దీనిని అధిగమించేందుకు చింతూరు మండలానికి సీపీడబ్ల్యూఎస్ఎస్ (కాంప్రహెన్సివ్ ప్రొటెక్టెడ్ వాటర్ సప్లయి స్కీం) కింద రూ.14 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో వేగవంతంగా పనులు జరిగి తాగునీటి పథకం పూర్తయింది. ఈ పథకాన్ని మార్చి 13, 2022 ను ప్రారంభించారు. దీంతో చింతూరుతో పాటు పలు గ్రామాలకు రోజూ సురక్షిత తాగునీరు అందుతోంది.



తాగునీటి సరఫరాకు సంబంధించిన వివరాల పట్టిక

26 గ్రామాలకు తాగునీరు

ఈ పథకం కింద చింతూరు మండలంలోని 26 గ్రామాలకు రక్షిత మంచినీరు అందుతోంది. 26 గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. 26 గ్రామాల్లో ఇప్పటివరకు రక్షిత తాగునీటికి నోచుకోని ఎన్నో మారుమూల గిరిజన గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు ఇప్పటివరకు వాగులు, బోర్ల నీటిని మాత్రమే వినియోగిస్తుండగా ఈ పథకం అందుబాటులో రావడంతో సురక్షితమైన రక్షిత నీటిని పొందుతున్నారు.

నీటి సరఫరా ఇలా

స్థానిక శబరినది నుంచి నీటిని పంపింగ్ సిస్టం ద్వారా ఎర్రంపేటలో నిర్మించిన ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్(ఆర్ఎస్ఎఫ్) ప్లాంట్‌కు సరఫరా చేస్తున్నారు. దీని ద్వారా ప్రతిరోజూ నాలుగు మిలియన్ లీటర్ల నీటిని శుద్ధిచేసి అనంతరం క్లియర్ వాటర్ సంప్‌లోకి పంపుతారు. అనంతరం 60 వేల లీటర్ల కెపాసిటీ కలిగిన ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(ఓహెచ్‌బీఆర్)లో నిలువ చేస్తారు. ఈ రిజర్వాయర్ నుంచి పైప్ లైన్ ద్వారా 26 గ్రామాల్లో నిర్మించిన 20 నుంచి 90 వేల లీటర్ల పరిమాణం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకుల్లోకి నీటిని పంపుతున్నారు. ట్యాంకుల వద్ద నుంచి జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఆయా గ్రామాల్లో ఇళ్లకు నిర్మించిన కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.



ఎర్రంపేటలో నిర్మించిన ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్



నిమ్మలగూడెంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు



చింతూరులో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు

నీరు సరఫరా అవుతున్న గ్రామాలివీ..

చిడుమూరు, తుమ్మల, రింగల, గంగన్నమెట్ట, సింగన్నగూడెం, నర్సింహాపురం, వీరాపురం, చట్టి, కుయిగూరు, చింతూరు, ఎర్రంపేట, లక్ష్మీపురం, చూటూరు, ముకునూరు, నర్సింగపేట, రత్నాపురం, నిమ్మలగూడెం, వేగితోట, కొల్తూరు, చినసీతనపల్లి, అల్లిగూడెం, పోతనపల్లి, కంసులూరు, రామన్నపాలెం, లక్కవరం, కల్లేరు గ్రామాలున్నాయి.

సమస్య తీరింది



ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా రోజూ తాగునీరు సరఫరా అవుతోంది. గతంలో తాగునీటి కోసం నానా అవస్థలు ఎదుర్కొన్నాం. కిలోమీటర్ల దూరంలోని బావుల నుంచి నీళ్లు తెచ్చుకోవాల్సి వచ్చేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ట్యాంకులు నిర్మించి నీరు సరఫరా చేస్తున్నారు. తాగునీటి సమస్య తీరింది. **– శ్యామల తిరపతమ్మ**, చిడుమూరు

జగనన్నకు రుణపడి ఉంటాం



మా గ్రామానికి ఎంతో దూరంలో ఉన్న శబరినది నుంచి ఈ పథకం ద్వారా తాగునీరు సరఫరా జరుగుతోంది. శుద్ధి చేసిన నీరు సరఫరా చేస్తున్నారు. తాగేందుకు ఎంతో బాగున్నాయి. ఏళ్ల తరబడి సమస్య పరిష్కారమవడంతో జగనన్నకు రుణపడి ఉంటాం.

–సోయం దూలయ్య, గంగన్నమెట్ట

నిరంతరంగా సరఫరా



ఎర్రంపేటలో నిర్మించిన సీపీడబ్ల్యూఎస్ పథకం ద్వారా 26 గ్రామాలకు తాగునీటిని నిరంతరంగా సరఫరా చేస్తున్నాం. త్వరలోనే అన్ని గ్రామాల్లోని ఇళ్లకు కుళాయిలు నిర్మించి నీటిని సరఫరా చేస్తాం.

– బుచ్చిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ,

జీసీసీ బలోపేతానికి కృషి

కొయ్యూరు: సంస్థ బలోపేతానికి కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లు కృషి చేయాలని గిరిజన సహకార సంస్థ (జీసీసీ)బీఎం విజయకుమార్ అన్నారు. ఆయన గురువారం కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లు పొట్టిక సత్యనారాయణ, కోడా వెంకటరమణ, కిముడు రాజు, తూబే చిన్నయ్యదొరతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సంస్థ నిర్వహించే ప్రతీ సమావేశానికి డైరెక్టర్లు హాజరు కావాలన్నారు. వరుసగా మూడు సమావేశాలకు రాకుంటే వారిని తొలగించి కొత్త వారిని నియమిస్తారన్నారు. జీసీసీ నుంచి రైతులకు రుణాలు ఇస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదే విధంగా రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి సంస్థకు చెల్లించేదుకు కృషి చేయాలన్నారు. ఇందుకోసం డైరెక్టర్లు సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా ఎన్నికైన డైరెక్టర్లకు బ్రాంచ్ మేనేజర్ విజయకుమార్ అభినందనలు తెలిపారు



ఎన్నికైన డైరెక్టర్లతో జీసీసీ బీఎం, సిబ్బంది

ఆత్మీయ సన్మానం



ఎంపీపీ అనూషదేవిని సన్మానిస్తున్న అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

చింతపల్లిరూరల్: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపీపీ అనూషదేవీను ప్రభుత్వం నియమించడంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు, అధికారులు ఆమెకు అభినందనలు తెలిపారు. ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనూషదేవి మాట్లాడుతూ అధిష్టానం తనకు మరింత బాధ్యతను అప్పగించిందని, పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఎంపీడీవో ఆశాజ్యోతి, సర్పంచ్ దురియా పుష్పలత, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, ఏవో రవీంద్ర, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, ఎంపీటీసీ సభ్యులు ధారలక్ష్మి, జయలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు నాజర్‌వలీ, పంచాయతీ కార్యదర్శులు పూర్ణచంద్రరావు, రాజేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్లను సద్వినియోగం చేసుకోవాలి

జి.మాడుగుల: మండల కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్‌లలో భాగంగా గ్యాస్ స్టవ్ ఇతరత్రా సామగ్రిని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు ఎం.విజయకుమారి, మాజీ ఎంపీపీ ఎం.వెంకటగంగరాజు, సర్పంచ్ కె.రాంబాబు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్‌లను ప్రభుత్వం అందజేస్తోందని, అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిదొర, పాడేరు ఏఎంసీ ట్రెజరర్ బాబూరావు, గ్యాస్ గోడౌన్ సూపరింటెండెంట్ రామచంద్రరాజు, నాయకుడు మత్స్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్‌స్టవ్‌లను అందజేస్తున్న మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, ఎంపీటీసీ విజయ

ఇంధన పొదుపుపై అవగాహన

జి.మాడుగుల/చింతపల్లి రూరల్/గూడెం కొత్తవీధి: విద్యుత్‌ను పొదుపుగా వాడుకొని భావితరాలకు భరోసా నిద్దామని తూర్పు విద్యుత్ పంపిణీ ఆపరేషన్ ఏడీ సూర్యప్రకాష్ తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా జి.మాడుగుల, చింతపల్లి, గూడెం కొత్తవీధి ప్రాంతాల్లో కళాజాత నిర్వహించి విద్యుత్ వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవటం వలన ఆదాయాన్ని ఆదా చేసుకోవచ్చన్నారు. ఏఈఈ ప్రభాకరరావు, అసిస్టెంట్ ఇంజినీర్ రమణ, లైన్ ఇన్‌స్పెక్టర్ షాజహాన్, లైన్‌మెన్లు సంజీవరావు, రమణ, బుజ్జి తదితరలు పాల్గొన్నారు.



జి.మాడుగులలో కళాజాత

అంగన్‌వాడీ, తపాలా ఉద్యోగుల నిరసనలు

జి.మాడుగుల/అడ్డతీగల: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు జి.మాడుగుల, అడ్డతీగల తదితర ప్రాంతాల్లో నిరసన చేపట్టారు. వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మోదకొండమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన సమ్మె

ముంచంగిపుట్టు/మారేడుమిల్లి/రాజవొమ్మంగి: వివిధ సమస్యల పరిష్కారానికి డాక్ సేవకులు చేపట్టిన సమ్మె గురువారం నాటికి మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీమా, గ్రాడ్యుటీ పెంచాలని తదితర డిమాండ్లు చేశారు. కేశవ్, సురేష్, సత్యనారాయణ, నాగరాజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి పెద్దదేవుడు జాతర

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి గ్రామంలో ఈ నెల 17, 18 తేదీల్లో పెద్దదేవుడు జాతర నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజులపాటు నిర్వహించనున్న జాతరకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి జాతరకు విజయవంతం చేయాలని కోరారు. కమిటీ సభ్యులు స్వామి, మధున్‌రావు, గోపాల్, భగత్‌రాం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని వనభపింగి పంచాయతీ కొత్తూరు గ్రామంలో తాగునీటి బావి మరమ్మతు చేయాలని కోరుతూ మండల పార్టీ అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ తదితరులు ఎంపీడీవో కిరణ్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. బావి పాడవడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎంపీడీవో కిరణకుమార్ స్పందించి బావి బాగుచేస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ జయదేవ్, నేతలు పులిరాజు, దాసు, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

గంగవరం: మొల్లేరు సొసైటీ ఆవరణలో సొసైటీ సీఈవో జయరాజు అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు బ్యాంకు సేవలపై రైతులకు అవగాహన కల్పించారు. బ్యాలెన్స్ ఖాతాను ప్రారంభించారు. జీరో బ్యాలెన్స్ , రూపే డిబిట్ కార్డుల గురించి వివరించారు. మెరుగైన సేవలందిస్తున్నామన్నారు.

18న మండల సమావేశం

ఎటపాక: ఎటపాక మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం 18న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ గురువారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పాఠశాల స్వర్ణోత్సవాలకు ఏర్పాట్లు



పాఠశాల స్వర్ణోత్సవాలను పర్యవేక్షిస్తున్న పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశ విదేశాల్లో వివిధ కొలువుల్లో వున్న దాదాపు 3 వేల మంది పూర్వ విద్యార్థులు ఈ వేడుకకు హాజరౌతున్నట్టు ఓ అంచనా. పూర్వ విద్యార్థులు లక్షల రూపాయలు వెచ్చించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పండుగకు వచ్చే వారి కోసం శని, ఆదివారాల్లో నవకాయ వంటకాలతో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంకాలం విందు ఏర్పాటు చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం వసతి సదుపాయాలు ఏర్పాటు చేశారు. గురుపూజోత్సవం సందర్భంగా పాఠశాలలో పని చేసిన 34 బ్యాచ్‌లకు చెందిన దాదాపు 100 మంది గురువులను సత్కరించనున్నారు. వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థి సూర్యనారాయణ రాజు సోదరులు రూ. 8 లక్షలు వెచ్చించి తయారుచేయించిన అల్లూరి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. కళా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్వర్ణో

అవగాహనతోనే మరింత నైపుణ్యం



అవగాహన కల్పిస్తున్న మూర్తి

అరకులోయ రూరల్: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరం, వెలుగు కార్యాలయం, పెదలబుడు సచివాలయం-2లలో గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా ట్రైనర్ వి.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం నుంచి అందే ప్రతి లబ్ధిని ప్రజలకు అందజేసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అవగాహనతోనే మరింత నైపుణ్యం పెంపొందించుకోవచ్చని చెప్పారు. సచివాలయం ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంగా పనిచేస్తేనే ప్రజలకు మరింత ప్రభుత్వ సేవలు అందుతాయన్నారు.ప్రతి ఒక్కరూ రిఫ్రెషర్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రైనర్ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రమేష్, నాయకులు



లగిసపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శిస్తున్న, రాంబాబు, నాయకులు



భీమవరంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శిస్తున్న జెడ్పీటీసీ మత్స్యలింగం,నేతలు



కిలగాడలో గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న నేతలు

కొయ్యూరు: మండలంలోని రేవళ్లలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. వివిధ సంక్షేమ పథకాల్లో రేవళ్ల పంచాయతీలో రూ.11 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పేదల అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కన్వీనర్లు సుధాకర్, కుశల, ఉప సర్పంచ్ నాగేంద్ర, నేతలు నాగరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్: మండలంలోని లగిసపల్లిలో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.రాంబాబు, నేతలు పార్టీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సూరిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ్లన్నదొర, సర్పంచ్‌లు రాంబాబు, సన్నిబాబు, ఎంపీటీసీ సభ్యుడు పాత్రుడు, నాయకులు దశమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని భీమవరంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, మండల పార్టీ అధ్యక్షుడు జి.కొండబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, సర్పంచ్ సన్నిబాబు, నాయకులు సూర్యం, రాజారావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, సర్పంచ్‌లు నరసింగరావు, బాబూరావు, కన్వీనర్ కొండలరావు, నాయకులు బాబూరావు, చంటిబాబు, సిద్ధేశ్ తదితరులు పాల్గొన్నారు.